క్లుప్తంగా

బూరుగడ్డ ఆలయంలో గోమాతకు పూజలు


గోమాత పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్ర కుంకుమార్చనను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ వంటి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గోటితో ఒలిచి.. తలంబ్రాలుగా మార్చి


వడ్లను ఒలుస్తున్న భక్తులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని కోదండ రామాలయంలో ఈ నెల 17న నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణానికి కావాల్సిన తలంబ్రాలను భక్తులు గోటితో ఒలుస్తున్నారు. ఇటీవలే అత్యంత వైభవంగా పునఃప్రతిష్ఠ జరిగిన ఈ ఆలయంలో రాములోరి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం వడ్లను తీసుకొచ్చి ఒక్కో గింజను ఒలిచి బియ్యం తయారు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మహిళ భక్తులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి ప్రభుత్వసాయం అందేలా చూస్తా : ప్రసాద్

కోదాడ : తాటి చెట్టు పైనుంచి పడి గాయపడిన గీతకార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన సాయం అందేలా చూస్తానని గౌడ సంఘం నాయకుడు కేఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి కోదాడ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మేళ్లచెరువు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన దాసు లక్ష్మీనారాయణను శుక్రవారం ఆయన పరామర్శించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో త్వరగా సాయం అందించడానికి తనవంతు కృషి చేస్తానని బాధితుడికి ఆయన హామీ ఇచ్చారు.

అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయాలి

గరిడేపల్లి : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీన భారతరత్న, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాళ ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఓటు హక్కు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. కేవలం కొంత మందికి మాత్రమే ఓటు హక్కు ఉండాలన్న నాటి జాతీయ నేతల మెడలు వంచి ఓటు అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అందరికీ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఉండాలని నినదించి విజయం సాధించిన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు.

ఇంత నిర్లక్ష్యమా..


మునగాలలో చుట్టూ కంచె లేకుండా ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మునగాల : మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. మునగాల నడిబొడ్డున నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దాని చుట్టూ ఎటువంటి కంచె కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఏ సమయంలో ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే సంబంధిత శాఖ సిబ్బంది స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

సారా పట్టివేత

మద్దిరాల : మండల పరిధిలోని చౌళ్లతండా గ్రామపంచాయతీ ఆవాసం రాజానాయక్ తండాలో శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. బాదవత్ హుస్సేన్ ఇంట్లో నిల్వ చేసిన 10లీటర్ల సారాను గుర్తించి సీజ్ చేసినట్లు చేశారు. ఎస్ఐ వెంట ఎస్‌బీ రవికుమార్ తదితరులు ఉన్నారు.

సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు

- మధ్యాహ్న భోజనం కార్మికులకు బిల్లులు ఆరు నెలలుగా పెండింగ్
- అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్న ఏజెన్సీలు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన


నడిగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

నడిగూడెం : రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టే నిర్వాహకులకు మాత్రం బిల్లులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వీడడం లేదు. గత ఏడు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో మహిళా కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నడిగూడెం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో 11 ఉన్నత పాఠశాలలు, 26 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 55 మంది స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. అయితే గత ఏడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌తో పాటు ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన మధ్యాహ్న భోజన పథకం బిల్లులు మంజూరు కాలేదు. మండలానికి చెందిన మొత్తం 37 మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ఒక్క నెలకే దాదాపు రెండున్నర లక్షల రూపాయలు మంజూరు కావాల్సి ఉంది. విద్యా సంవత్సరం పూర్తి కావచ్చినా నేటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల స్పందన కరువు..

మండలానికి చెందిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు గత ఏడు నెలలుగా అప్పులు చేసి మరీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నామని పలువురు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయలను అప్పు చేసి తెస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను కోరినా స్పందన కరువైందని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



గత ఆరు నెలలుగా పెండింగ్ బిల్లులు మంజూరు కావడం లేదు. దీంతో అప్పులు చేసి మరీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నాం. బిల్లుల విషయమై అనేకసార్లు అధికారులను అడిగినా స్పందన కరువైంది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లిస్తేనే సరుకులు ఇస్తామని వ్యాపారులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి.

– ఎస్.ఉమ, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు, నడిగూడెం

నేటి నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

కోదాడ : కోదాడ పట్టణానికి తాగు నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్ గరిడేపల్లి వద్ద పగిలిపోవడంతో మరమ్మతులు చేస్తున్నందున పట్టణంలో కొన్ని ప్రాంతాలకు శనివారం నుంచి సోమవారం వరకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ఉండదని కోదాడ మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, మంచినీటి ఇబ్బంది ఏర్పడితే 8374454641, 7013318565, 9666164973 నంబర్లకు ఫోన్ చేస్తే మంచినీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని ఆమె తెలిపారు.

మునగాల మండలంలో..

మునగాల : మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన మెయిన్ పంపింగ్ వద్ద పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున మునగాల మండలంలోని 32 గ్రామాలకు శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకు తాగు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో బోర్లు, ట్యాంకర్ల ద్వారా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. కావున ఈ రెండు రోజులు ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రతి పార్టీ యొక్క ఆలోచన ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఉండాలని చెప్పారు. కానీ గతంలో ఏం జరిగింది ఇప్పుడు ఏం జరుగుతోందనేది ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో ఎండిపోతున్న పొలాలు, ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులు, కరెంటు కోత కారణంగా నిత్యం బావుల వద్దకు పోతూ పాము, తేలు కాటుకు, విద్యుత్ షాక్‌కు గురవుతూ చనిపోతున్న రైతుల దృశ్యాలు మళ్లీ కనబడుతున్నాయని అన్నారు. అయినా ప్రభుత్వానికి రైతులపై కనికరం లేదని, దానికి బీజేపీ మద్దతు పలుకుతోందని ఆరోపించారు. ఎండలు మండిపోతున్నా, ఆరోగ్యం సరిగా లేకున్నా రైతులను కాపాడుకునేందుకు కేసీఆర్ బయటకు వచ్చి పోరాటం చేస్తున్నారన్నారు. కేసీఆర్ బయటకు రాగానే హడావుడిగా నీరు ఇచ్చారని, కాళేశ్వరం పంపు ఆన్ చేశారని కానీ అప్పటికే రైతులకు జరగాల్సిన నష్టం జరిగిందని ఆయన గుర్తు చేశారు. గతంలో సాగర్‌లో 508 అడుగుల నీరున్నా నీరిచ్చి పంటలను కాపాడామని చెప్పారు. 515 అడుగులకు పైగా నీరున్నా ప్రభుత్వం సాగు నీరు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. జిల్లాలో పంటలు ఎండిపోతున్నా నీరు ఇవ్వకుండా తాగునీటి పేరుతో పాలేరుకు నీరు తరలించుకుపోతున్నా జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు మాట్లాడటం లేదని, చేతగాని మంత్రులు ఎందుకు ఉన్నట్లు అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల క్లిప్పింగ్‌లను తెరపై ప్రదర్శించి వాటి గురించి ప్రజలకు వివరించాలని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, విద్యావేత్త ఒంటెద్దు నర్సింహారెడ్డి, జెడ్పీటీసీలు కొప్పుల సైదిరెడ్డి, జగన్‌నాయక్, ఎంపీపీలు పార్వతి, జ్యోతి, డీసీసీబీ డైరెక్టర్లు రంగాచారి, అప్పిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునగాల : మండలంలోని తిమ్మారెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33కేవీ విద్యుత్ లైన్‌కు తాకుతున్న చెట్లను నరికివేయనున్నందున గణపవరం, తిమ్మారెడ్డిగూడెం, కొక్కిరేణి గ్రామాలకు శనివారం ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ వికాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాలకవీడు మండలంలో..

పాలకవీడు : మండలంలోని పాలకవీడు, అలింగాపురం, జాన్‌పహాడ్ గ్రామాల్లో గల 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతులు, లైన్ క్లియరెన్స్ చేపట్టనున్నందున ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 7 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్మలచెరువు సబ్‌స్టేషన్ పరిధిలో..

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు సబ్‌స్టేషన్ పరిధిలో గల ఫీడర్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి 10. 30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రావిరాల నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బూరుగడ్డ సబ్‌స్టేషన్ పరిధిలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ లైన్‌లో వైర్లకు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించనున్నందున బూరుగడ్డ, కరక్కాయలగూడెం, మట్రిగూడెం, గోపాలపురం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ రాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హుజూర్‌నగర్ పట్టణంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ పట్టణంలోని గాంధీపార్క్ సెంటర్‌లో ఐరన్ స్తంభాన్ని మార్చుట కోసం గాంధీ పార్క్ నుంచి ఏరియా ఆస్పత్రి మెయిన్ రోడ్, ముత్తయ్య హోటల్ బజార్, కనకదుర్గమ్మ గుడి ప్రాంతంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ రాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరేడుచర్ల మండలంలో..

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్లలోని 33/11కేవీ పరిధిలోని దిర్శించర్ల, నేరేడుచర్ల టౌన్ -2 11కేవీ ఫీడర్లు, ముకుందాపురం 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని దాసారం, సోమారం, తెలగరామయ్యగూడెం, చిల్లేపల్లిలోని 11కేవీల ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


చేతికి అందెంత ఎత్తులో విద్యుత్ తీగలు

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల మట్రికుంట చెరువులో ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు చేతికి అందేంత ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతం నుంచి వెళ్లాలంటే గ్రామస్తులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. రైతులు పొలాల వద్దకు ట్రాక్టర్, వరికోత యంత్రాలతో వెళ్లే పరిస్థితి లేక కి.మీ దూరం తిరిగి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రెండు విద్యుత్ స్తంభాల మధ్య మరో స్తంభం ఏర్పాటు చేసి వేలాడుతున్న తీగలను సరిచేయాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

ఇసుక డంప్ సీజ్

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి దుర్గాభవానీ కంకర మిల్లులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించనట్లు తెలిపారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది ఎల్లయ్య, నారాయణరెడ్డి, వీరునాయక్ తదితరులు ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

నాగారం : మండలంలోని నాగారం, వర్ధమానుకోట, డి.కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం కేంద్ర పారామిలటరీ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా స్థానిక సీఐ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం కొరకు పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడం కోసం పోలీసుశాఖ కృషి చేస్తోందన్నారు. మండలంలోని వర్ధమానుకోట, డి.కొత్తపల్లి గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి, పారామిలటరీ దళాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై నిరంతర పోరాటం


మునగాలలో మాట్లాడుతున్న దేవరం వెంకటరెడ్డి

మునగాల : రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రైతు సంఘం నిరంతర పోరాటం చేస్తుందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి అన్నారు. రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మునగాల మండల కేంద్రంలో ఆయన రైతు సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వలస పాలన, భూస్వామ్య పీడన, వడ్డీ వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులను సంఘటితపరిచే క్రమంలో 1936లో ఉత్తరప్రదేశ్‌లో లక్నో వేదికగా అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు గడ్డం వినోద్, కిన్నెర వెంకన్న, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, సిరికొండ యాదగిరి, పాలబిందెల చిరంజీవి, సిరికొండ సురేష్, సిరికొండ వెంకటేశ్వర్లు, దాసరి అంజయ్య, తురక గుర్వయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ రాజకీయ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తుంగతుర్తి శాసనసభ్యుడు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన సుమారు 150 మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే తుంగతుర్తి మండల పరిధిలోని కేశవపురం మాజీ సర్పంచ్ మిరియాల అనిత జనార్దన్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ అనసూయ, మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ కవిత లక్ష్మీనరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రం సందర్శన


సూర్యక్షేత్రంలో గురుకుల పాఠశాల విద్యార్థులు

అర్వపల్లి : కోదాడ నియోజకవర్గంలోని నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రధానమంత్రి శ్రీ పథకం కింద ఎంపికైంది. దీంతో పథకం నిబంధనల ప్రకారం విద్యార్థినులకు శుక్రవారం క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని సందర్శించారు. క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి విద్యార్థులకు క్షేత్ర విశిష్టతను తెలియజేశారు. ప్రిన్సిపాల్ ధన విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రజని, సునీత, నిర్మల పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో సాఫ్ట్‌వేర్‌లో రాణించొచ్చు


మాట్లాడుతున్న మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరావు

చిలుకూరు : విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించవచ్చని మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన చిలుకూరు మండల పరిధిలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులకు శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి కనబరచాలన్నారు. ఏ విషయమైనా సంపూర్ణంగా తెలుసుకొని అవగాహన పెంచుకోవాలని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాడెంట్ మధిర ప్రీతిరెడ్డి, వైస్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి కనీస సౌకర్యాలు కరువు

- ఇళ్ల వద్ద నుంచే తాగునీటిని తీసుకెళ్తున్న కూలీలు
- టార్పాలిన్లు సమకూర్చడం మరిచిన ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న జనం


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

మోతె : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పని ప్రదేశంలో కూలీలకు ఎండ నుంచి ఉపశమనం కోసం ప్రభుత్వం టార్పలిన్లు అందించేది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం కూలీల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పని ప్రదేశంలో గాయపడిన కూలీలకు ప్రథమ చికిత్స చేయడం కోసం గతంలో మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు అవి కనిపించడం లేదు. కనీసం తాగునీటి అందించే పరిస్థితి కూడా లేకపోవడంతో కూలీలు ఇంటి దగ్గర నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. గతంలో ప్రతి ఇరవై మంది ఒక గుంపుగా ఏర్పడితే అందులో ఒకరు అందరికీ తాగునీరు అందించే వారు. మంచినీరు అందించినందుకు ఆ కూలీకి ప్రత్యేక చెల్లింపులు ఉండేవి. కానీ ఇప్పుడు ఆ చెల్లింపులే లేవు. గడ్డపార, పార, తట్ట, గొడ్డలి వంటి పనిముట్లను ప్రభుత్వమే సమకూర్చేది. ఆ తర్వాతా పనిముట్లకు గాను ప్రభుత్వం డబ్బులు చెల్లించేది. కానీ ప్రస్తుతం ఆ చెల్లింపులు నిలిపివేయడం నిలిపివేసింది. దీంతో కూలీలు పనిముట్ల విషయంలో ఇబ్బందులు పడుతున్నారు.

పనిముట్ల మరమ్మతులకు ఖర్చు..

గతంలో కూలీలు సొంతం గడ్డ పారలు సమకూర్చుకుంటే రోజుకు రూ.10లు వేతనంలో కలిపి ఇచ్చేవారు. తాగు నీటికి మరో రూ.5లు అందించే వారు. కూలీల వేతనాలను రెండేళ్ల క్రితం నుంచి కేంద్ర సర్కార్‌కు అనుసంధానం చేయడంతో అసలు సమస్య మొదలైంది. అప్పటి నుంచి కూలీలకు సదుపాయాలు కల్పించలేకపోగా వాటికి బదులు ఇచ్చే డబ్బులు కూడా అందించని పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల నేల గట్టిగా ఉండి మట్టి తవ్వడం కష్టమవుతోందని కూలీలు అంటున్నారు. దీంతో గడ్డపారలకు మొన చేయించాలంటే వారానికి రెండు వందల వరకు ఖర్చు అవుతుందని తామే భరించాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

భువనగిరి ఎన్నికల్లో సీపీఎంను గెలిపించాలి


ప్రచారం చేస్తున్న మల్లు లక్ష్మి, సీపీఎం నాయకులు

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి ఓటర్లను కోరారు. సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్ గెలుపు కోసం శుక్రవారం జాజిరెడ్డిగూడెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సీపీఎంను గెలిపించాలన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలలో గతంలో సీపీఎం ఎమ్మెల్యేలు గెలిచారని చెప్పారు. ఈసారి భువనగిరి గడ్డపై ఎర్రజెండా ఎగరడం ఖాయమన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులకు ఈ ప్రాంతంపై ఎలాంటి అవగాహన లేదని చెప్పారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, కొప్పుల రజిత, కొప్పోజు సరోజ, శిగ వెంకన్న, కొమ్ము విజయ్‌కుమార్, శ్రీను, శ్రీకాంత్, వినయ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

నిర్లక్ష్య ధోరణిలో సిబ్బంది.. ప్రజలకు ఇబ్బంది

- పీహెచ్‌సీలో మందులు లేకపోయినా పట్టికలో మాత్రం ఉన్నట్లు రాతలు
- ఫ్లెక్సీపై సమాచార అధికారిగా రెండేళ్ల క్రితం బదిలీపై వెళ్లిన అధికారి పేరు
- మధ్యాహ్నం తర్వాత సిబ్బంది అందుబాటులో ఉండరని విమర్శలు


చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చిలుకూరు : చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరిశీలిస్తే ఆ మాటలు నిజమే అనేలా ఉన్నాయి. అయితే ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన డాక్టర్ ప్రమోద్‌కుమార్ రెండు సంవత్సరాల క్రితమే బదిలీపై వెళ్లిపోయారు. కానీ నేటివరకు కూడా ఆరోగ్య కేంద్రంలో సమాచార అధికారిగా ఆయన పేరుతోనే ఫ్లెక్సీ ఉండడం గమనార్హం. ఇదిలా ఉండగా ఆరోగ్య కేంద్రంలోని సాధారణ ట్యాబ్లెట్స్ స్టాక్ రిజిస్టార్ పట్టికలో మందులు అందుబాటులో ఉన్నట్లు ఎస్ అని రాశారు. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ మందులు ఒక్కటి కూడా అందుబాటులో లేవని తెలుస్తోంది. ఇక ప్రస్తుతం ఆరోగ్య కేంద్రానికి రెండు నెలలుగా జలుబు, ఒళ్లు నొప్పులు, బీపీ తదితర ట్యాబ్లెట్స్ రావడం లేదని సమాచారం. దీంతో ఎవరైన వచ్చి ట్యాబ్లెట్స్ అడిగితే మందులు లేవని, పై నుంచి రావడం లేదని సిబ్బంది జవాబు ఇస్తున్నారు. కానీ పట్టికలో మాత్రం ట్యాబ్లెట్స్ ఉన్నట్లు ఎస్ అని పెడుతున్నారు. అంతేగాక సిబ్బంది కూడా ఆరోగ్య కేంద్రంలో సక్రమంగా ఉండడం లేదని విమర్శలు వినబడుతున్నాయి. పేరుకే 24 గంటల వైద్యశాల అయినప్పటికీ డాక్టర్లు, సిబ్బంది కేవలం మధ్యాహ్నం ఒంటి గంట వరకు అందుబాటులో ఉంటున్నారని ఆ తరువాత ఎవరైనా ఒక్కరు అందుబాటులో ఉండి నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.


ఫ్లెక్సీపై సమాచార అధికారిగా రెండేళ్ల క్రితం పీహెచ్‌సీ నుంచి బదిలీపై వెళ్లిన అధికారి పేరు



పీహెచ్‌సీలో మందులు లేకపోయినా స్టాక్ బోర్డులో మందులు ఉన్నట్లు ఎస్ అని పెట్టిన సిబ్బంది

పర్యవేక్షణ లేకపోవడంతో..

అయితే ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు కనీసం సౌకర్యాలు కల్పించడం, అభివృద్ధి పనులు చేపట్టడం కోసం ఆరోగ్య కేంద్రానికి అభివృద్ధి కమిటీ ఉంటుంది. ఆ కమిటీలో ఎంపీపీ, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంపీడీఓ, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, డాక్టర్ సభ్యులుగా ఉంటారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి వీరు సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులకు తీర్మాణాలు చేసి పనులు చేయాల్సి ఉంటుంది. కానీ చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత కొన్ని నెలలుగా అభివృద్ధి కమిటీ సమావేశాలు పెట్టడం లేదు. అధికారులు, అభివృద్ధి కమిటీ, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆరోగ్య కేంద్రం అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. మండల కేంద్రంలోని వైద్యశాలే ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉప వైద్యశాలల పరిస్థితి ఏంటని అని పలువురు గ్రామస్తులు అంటున్నారు. అంతేగాక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది మధ్య కూడా సమన్వయం లేదని అంటున్నారు. ఇప్పటికై నా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గాడిలో పెట్టి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని కోరుతున్నారు.